అన్నదాతకు యూరియా తిప్పలు



మద్దిరాలలో ఫర్టిలైజర్ దుకాణం వద్ద క్యూ కట్టిన రైతులు



చివ్వెంల : వట్టిఖమ్మంపహాడ్‌లోని పీఏసీఎస్ ఎదుట..

మద్దిరాల : మండలంలో ఇంకా యూరియా కొరత తీరకపోవడంతో రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం మద్దిరాల మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణానికి యూరియా రావడంతో రైతులు బారులుదీరారు. రైతుల మధ్య స్వల్ప ఘర్షణలు చోటు చేసుకున్నాయి. పోలీసులు వచ్చి అల్లర్లు జరగకుండా పర్యవేక్షించారు. యూరియాను ఎక్కువ మొత్తంలో కేటాయించి రైతుల సమస్యలను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

చివ్వెంల: రైతులకు యూరియా లభించకపోవడంతో అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని వట్టిఖమ్మంపహాడ్ గ్రామానికి సోమవారం యూరియా రావడంతో రైతులు ఉదయం నుంచే పీఏసీఎస్ వద్ద బారులుదీరారు. దీంతో అధికారులు ఒక్కో రైతుకు ఒక బస్తా చొప్పున పంపిణీ చేశారు. అయితే సాయంత్రం వరకు ఉన్నా పలువురు రైతులకు యూరియా లభించకపోవడంతో నిరుత్సాహంతో ఇంటి ముఖం పట్టారు.

నూతనకల్ : యూరియా అందించడంలో పాలకులు, అధికారుల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ రైతులు మండల కేంద్రంలోని సూర్యాపేట–దంతాలపల్లి ప్రధాన రహదారిపై సోమవారం రాస్తారోకో నిర్వహించారు. రైతులకు సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బత్తుల సాయిలుగౌడ్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు మున్నా అశోక్‌లు సంఘీభావం తెలిపి రాస్తారోకోలో పాల్గొన్నారు.



నూతనకల్‌లో రాస్తారోకో నిర్వహిస్తున్న రైతులు



నూతనకల్‌లో క్యూలో ఉంచిన చెప్పులు, ఇటుకలు..

ధాన్యానికి ధరలేక.. రైతుల ఆవేదన

తిరుమలగిరి : తిరుమలగిరి వ్యవసాయ మార్కె ట్ యార్డుకు గత 15 రోజులుగా కత్తెర ధాన్యం వస్తోంది. యాసంగి, వానా కాలం మధ్య రైతులు ఈ కత్తెర పంటను వేస్తారు. అయితే ఈ ధాన్యానికి గిట్టుబాటు ధర రావడం లేదని రైతులు ఆందోళన చేస్తున్నారు. తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ యార్డుకు ఇప్పటి వరకు 4398 క్వింటాళ్ల ధాన్యం వచ్చింది. గరిష్ఠంగా క్వింటాళ్‌కు రూ.1902, కనిష్ఠంగా రూ.1650 మాత్రమే ధర పలికింది. 2025–26 సంవత్సరం నుంచి కేంద్రం వరి పంటకు మద్దతు ధర ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2389కు, సాధారణానికి రూ.2369కు పెంచింది. కానీ ఒక్క రైతుకు కూడా మద్దతు ధర రావడం లేదు. రైతులు ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకొని నష్టపోవాల్సి వస్తోంది.



తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉన్న ధాన్యం రాశులు

చరిత్రను వక్రీకరిస్తే ప్రజలు క్షమించరు

నూతనకల్ : తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను పాలకులు వక్రీకరిస్తే ప్రజలు క్షమించరని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని చిల్పకుంట్ల, వెంకెపల్లి గ్రామాల్లో నిర్వహించిన తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. సాయుధ పోరాట వీరుల చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాయుధ పోరాటంలో నేలకొరిగిన ప్రతి అమరుడి స్ఫూర్తితో నేటి యువత పాలకపక్షాల వైఫల్యాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు, మండల కార్యదర్శి కందాల శంకర్‌రెడ్డి, బొజ్జ శ్రీను, గజ్జెల శ్రీనివాస్‌రెడ్డి, బత్తుల జనార్దన్, తూడి మధుసూదన్‌రెడ్డి, తొట్ల హరీష్, ఎల్లావుల నరేష్, కూసు సైదులు, తొనుకునూరి ఉప్పలయ్య పాల్గొన్నారు.

సాయుధ పోరాటంలో తుంగతుర్తి పాత్ర కీలకం

తుంగతుర్తి : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో తుంగతుర్తి ప్రాంతం కీలకపాత్ర పోషించిందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్లంల యాదగిరి అన్నారు.. సోమవారం మండల పరిధిలోని వెంపటి గ్రామంలో దాయం రాజిరెడ్డి, దొంగరి ముత్తిలింగయ్య విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించి మాట్లాడారు. సాయుధ పోరాటంలో దాయం రాజిరెడ్డి పోరాటం మరువలేనిదని అన్నారు. నిజాం రజాకార్లకు వ్యతిరేకంగా గెరిల్లా పోరాటాలు నడిపిన చరిత్ర రాజిరెడ్డికి ఉందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో దాయం ఝాన్సీ, బోరా వెంకటేశ్వర్లు, రాజారాం, కోట రామస్వామి పాల్గొన్నారు.

మద్దిరాల : తెలంగాణ సాయుధ పోరాట వారసత్వాన్ని కొనసాగిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కోట గోపి అన్నారు. సోమవారం మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని మామిండ్లమడవ గ్రామంలో సాయుధ పోరాట యోధుల కుటుంబ సభ్యులను సన్మానించి మాట్లాడారు. సాయుధ పోరాట యోధుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ నెల 17న సూర్యాపేటలో నిర్వహించే సెమినార్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పోలోజు సైదులు, మండల కమిటీ సభ్యులు కల్లేపల్లి భాస్కర్, పాల్వాయి కవిత, కొంపెల్లి నాగయ్య, నెల్లుట్ల రాములు, రాగమ్మ తదితరులు పాల్గొన్నారు.



నూతనకల్ : బండి యాదగిరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



తుంగతుర్తి : వెంపటిలో దాయం రాజిరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

29న జ్యోతిర్లింగాలు, షిర్డీకి స్పెషల్ బస్సు

భానుపురి : ఈ నెల 23న టీజీఎస్ ఆర్టీసీ సూర్యాపేట డిపో నుంచి మహారాష్ట్రలోని నాలుగు జ్యోతిర్లింగాలు, షిర్డీ యాత్రకు స్పెషల్ బస్ సర్వీస్‌ను నడుపనున్నట్లు సూర్యాపేట డిపో మేనేజర్ లక్ష్మీనారాయణ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని డీఎం కార్యాలయంలో యాత్రకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. యాత్రలో భాగంగా బాసర సరస్వతీ దేవాలయం, నాందేడ్ సిక్కు దేవాలయం, పర్లి వైద్యనాథ్ జ్యోతిర్లింగం, ఎల్లోరా గుహలు, ఘృష్ణేశ్వర జ్యోతిర్లింగం, శని సింగనాపూర్, షిర్డీ సాయిబాబా టెంపుల్, నాసిక్ పంచవటి, కళారాం మందిర్, త్రయంబకేశ్వర జ్యోతిర్లింగం, భీమశంకేశ్వర జ్యోతిర్లింగం, పండరీపురం పాండురంగ విఠలస్వామి ఆలయం, తుల్జాపూర్ తుల్జా భవాని శక్తిపీఠం దర్శించవచ్చని తెలిపారు. ఐదు రోజులపాటు కొనసాగనున్న ఈ యాత్రకు ఈ నెల 23న రాత్రి 9 గంటలకు సూర్యాపేట కొత్త బస్టాండ్ నుంచి సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరుతుందని



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అధికారులు

తెలిపారు. తిరిగి ఈ నెల 28న రాత్రి 9 గంటలకు సూర్యాపేట చేరుకుంటుందని పేర్కొన్నారు. పెద్దలకు రూ.6 వేలు, చిన్న పిల్లలకు రూ.4వేలు ఛార్జీ అని, అడ్వాన్స్ రిజర్వేషన్ సౌకర్యం ఉందని తెలిపారు. వివరాలకు సెల్ 9959226306, 7989225791, 9948303712, 9951613278 నంబర్లలో సంప్రదించవచ్చని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ బి.సైదులు, డిప్యూటీ సూపరింటెండెంట్(పి) రమశ్రీ, డిప్యూటీ సూపరింటెండెంట్(ఎఫ్) ధనమ్మ, యాత్ర ప్రోగ్రాం ఇన్చార్జ్ రవికుమార్, ఏకాంబరం, ఫణీ పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

తుంగతుర్తి : తుంగతుర్తిలోని ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలకు మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సోమవారం పనులను బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపర్తి జ్ఞానసుందర్ పరిశీలించి మాట్లాడారు. రోడ్డు సమస్యను ముఖ్యమంత్రి, మంత్రి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా పనులకు మోక్షం లభించిందని అన్నారు. అంబేద్కర్ విగ్రహం నుంచి కోర్టు వరకు 900 మీటర్ల మేర సుమారు రూ.4 కోట్ల వ్యయంతో పనులు చేపడుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎమ్మెల్యే సామేల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆయనతోపాటు బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కారింగుల వెంకటేశ్వర్లు, న్యాయవాదులు భాషబోయిన వేణురాజ్, మల్లెపాక రవికుమార్, వంగాల నాగరాజు, సైదులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్దబోయిన అజయ్, శ్రీకాంత్, బత్తుల జలేంధర్, బొంకూరి నాగయ్య, కోట రామస్వామి, దేవేందర్, రమేష్, పులుసు సత్యం ఉన్నారు.

శ్రీవేంకటేశ్వరుడి సన్నిధిలో కృష్ణాష్టమి వేడుక



విశేష ప్రసాద నివేదన చేస్తున్న ఆలయ ప్రధాన అర్చకుడు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలచార్యులు

సూర్యాపేటటౌన్ : జిల్లా కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీపాంచరాత్ర ఆగమ శాస్త్రానుసారం సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సింహాసనంలో అష్టమి రోహిణి నక్షత్ర యుక్తంగా నిర్వహించే శ్రీకృష్ణుడి పుట్టిన రోజు వేడుకలను ఆండాళ్ గోష్ఠి భక్త బృందం ఆధ్వర్యంలో వైభవంగా జరిపారు. తెల్లవారు జామున స్వామివారికి పంచామృతాలతో తిరుమంజన స్నపనం (అభిషేకం) నిర్వహించి, సాయంత్రం పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. విశేష ప్రసాద నివేదనలు జరిపారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారి అష్టోత్తర నామాలు, భజనలు, కీర్తనలు దివ్య ప్రబంధ సేవా కాలం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలచార్యులు, సంకర్షణ ఆచార్యులు, శ్రీహరి ఆచార్యులు, ఫణికుమార్ ఆచార్యులు, బజ్జూరి కృష్ణయ్య, ఆండాలు గోష్ఠి భక్తబృందం, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

- ఎమ్మెల్యే మందుల సామేల్

తిరుమలగిరి : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడలు జాతీయ భావాన్ని పెంపొందిస్తాయని తుంగతుర్తి శాసన సభ్యుడు మందుల సామేల్ అన్నారు. తుంగతుర్తి డివిజన్ స్థాయి అండర్–14, 17 కబడ్డీ పోటీలను సోమవారం తిరుమలగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రీడలు శారీరక ధృడత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వై.నరేష్, గుడిపాటి సైదులు, అశోక్‌రెడ్డి, పేరాల వీరేష్, మండల విద్యాధికారి శాంతయ్య, ప్రధానోపాధ్యాయుడు దామెర శ్రీనివాస్, పీడీలు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని తుంగతుర్తి శాసన సభ్యుడు మందుల



కబడ్డీ ఆడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్

సామేల్ అన్నారు. సోమవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో మాట్లాడారు. కళాశాల నుంచి రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించిన వారికి సొంతంగా లక్ష రూపాయల నగదు పారితోషికం అందజేస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని, త్వరలోనే జూనియర్ కళాశాలకు నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఐ.శాంతయ్య, నరేష్, సైదులు, అశోక్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

18న శిక్షణ తరగతులు

సూర్యాపేట అర్బన్ : దోపిడీ వ్యవస్థ నిర్మూలనకు, సమానత్వ సమాజ నిర్మాణం కోసం పీఓడబ్ల్యూ పోరాటం చేస్తోందని పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల నరసమ్మ అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఈ నెల 18న నిర్వహించే రాజకీయ శిక్షణ తరగతుల సందర్భంగా ఏర్పాటు చేసిన పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. మహిళలను చైతన్యవంతం చేయడానికి సూర్యాపేటలో రాజకీయ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ తరగతులకు పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు అనసూయ, మంగ, టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పూలన్ హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా నాయకులు సామ ఉపేంద్ర, దీవెన, సుప్రియ, శ్రీలత పాల్గొన్నారు.

మత్తు పదార్థాలను నిర్మూలించాలని వినతి

సూర్యాపేట అర్బన్ : జిల్లాలో డ్రగ్స్, గంజాయి, మత్తుపదార్థాలను పూర్తిగా నిర్మూలించాల ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక అన్నారు. సోమవారం పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ వినతిపత్రం అందజేసి మాట్లాడారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల వల్ల యువత బంగారు భవిష్యత్తు అంధకారం అవుతోందన్నారు. సంబంధిత అధికారులు మత్తు పదార్థాల తయారీ కంపెనీలను, సంస్థలను సీజ్ చేయాలని, వాటిని తయారు చేస్తున్న వారిపై కేసులు పెట్టి కఠినంగా శిక్షించాలని కోరారు. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షులు మారసాని చంద్రకళ, సహాయ కార్యదర్శి ఒంటికొమ్ము సంతోషి, జిల్లా నాయకులు హైతరాజు పద్మ, రాధా, మీనాక్షి, హైమావతి పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక

చేయూత పెన్షన్ పెంపు హామీ నెరవేర్చాలి



తిరుమలగిరిలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పింఛన్‌దారులు

తిరుమలగిరి : చేయూత పింఛన్లను పెంచాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్, సీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేముల వెంకన్న మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం వికలాంగులకు రూ.6000, చేయుత పెన్షన్‌దారులకు రూ.4000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ హరిప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ చింతకాయల సత్తయ్య ఒంగాల సాయిలు, కొండమ్మ జ్యోతి, ఎల్లమ్మ, లక్ష్మి, రమేష్, స్వరూప నారాయణ, భద్రమ్మ, యాదమ్మ, రాములమ్మ పాల్గొన్నారు.

మద్దిరాల : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్లుగా వృద్ధులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు, వికలాంగులకు పింఛన్లు పెంచాలని ఎమ్మార్పీఎస్ నియోజవర్గ ఇన్‌చార్జ్ పాల్వాయి బాలయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సూర్యాపేట–దంతాలపల్లి ప్రధాన రహదారిపై ధర్నా చేసి మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ అయేషా పర్వీన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ కోడిశాల లింగయ్య, రాంపాక వెంకన్న, తేలుకుంట్ల అంజయ్య, దుగ్యాల అశోక్‌రావు, మాతంగి బుచ్చమ్మ, మంగమ్మ, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్ (ఎస్) : వికలాంగుల పెన్షన్లు పెంచేవరకు కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేస్తామని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మేడి కృష్ణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీల ఆధ్వర్యంలో చేయూత పింఛన్‌దారుల హక్కుల పోరాట సమితితో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ జహీర్ బాబా, ఎంఎస్పీ మండల అధ్యక్షుడు నవీన్ మాదిగ, ఉపాధ్యక్షుడు పిడమర్తి ఉమేష్ మాదిగ, అధికార ప్రతినిధి మిరియాల చిన్ని మాదిగ, బండి ఎల్లయ్య, ధర్మల నగేష్, కొప్పుల కళింగ రెడ్డి, బూడిద రామస్వామి, మరిపెల్లి శ్రీనివాస్, పాండవుల లింగయ్య, బత్తుల జంపయ్య, యశోద, జానీ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

చివ్వెంల : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎమ్మార్పీఎస్, ఎంపీఎస్, వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో వికలాంగులు, వృద్ధులు, తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వికలాంగులకు రూ.6 వేలు, వితంతు, వృద్ధులకు రూ.4 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ మండల అధ్యక్షుడు చెరుకుపల్లి కిరణ్‌కుమార్, చెరుకుపల్లి సతీష్, మొండికత్తి మనోజ్, ఈదయ్య, వల్దాస్ శివ, కలకొండ రమేష్, తిప్పర్తి మైసయ్య, షేక్ సైదులు, పాపయ్య, ఖాసీంబీ, నిజామొద్దీన్, రేణుక, నాగమ్మ, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులో జాప్యం తగదు



ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

సూర్యాపేట అర్బన్: ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులో ప్రభుత్వం జాప్యం చేయడాన్ని నిరసిస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ దిష్టిబొమ్మను విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో దహనం చేశారు. అనంతరం పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 10 ఏళ్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా కాలేజీ మేనేజ్మెంట్లను, విద్యార్థులను ఆగం చేసిందని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మంట్‌కు బ్రాండ్ అంబాసిడర్ అయిన కాంగ్రెస్ పార్టీ కూడా బకాయిలు చెల్లించకుండా వారి జీవితాలతో ఆడుకుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ డివిజన్ ప్రధాన కార్యదర్శి పిడమర్తి భరత్, జిల్లా నాయకులు బోరా లెనిన్, సంధ్య, మహేశ్వరి, లావణ్య, పావని, శైలజ, అఖిల, మహేష్, నవీన్, వినయ్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

సూర్యాపేట అర్బన్ : విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మలు తొలగిస్తున్నందున సూర్యాపేట పట్టణంలోని పలు ప్రాంతాలకు మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పట్టణ ఏఈ సురేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 9:00 నుంచి మధ్యాహ్నం 12 :00 గంటల వరకు శ్రీనివాస కాలనీ, డీమార్ట్ వెనకాల, రాజారామ్ కాలేజీ, 60 ఫీట్ల రోడ్డు, ఏపూర్ బస్టాండ్, ఎల్ఐసీ ఆఫీస్, రామలింగేశ్వర థియేటర్, మధు ట్రావెల్స్, రాజారాం కాలేజీ, పాత నవత ట్రాన్స్‌పోర్టు దగ్గర విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు. అంతరాయానికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సంక్షిప్త సమాచారం

17న సాయుధ పోరాట చరిత్రపై సెమినార్

నాగారం : సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 17న సూర్యాపేటలో నిర్వహించే సెమినార్‌ను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కడియం కుమార్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

ఇసుక రవాణా నిలిపివేయాలని వినతి

నాగారం : జాజిరెడ్డిగూడెం సాండ్ ట్యాక్సీ పాలసీ ద్వారా జరుగుతున్న ఇసుక రవాణాను తమ పేరబోయినగూడెం గ్రామం నుంచి జరగకుండా నిలిపివేయాలని కోరుతూ పలువురు గ్రామస్తులు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ హరికిషోర్‌శర్మకు వినతిపత్రం అందజేశారు. జాజిరెడ్డిగూడెం, పేరబోయినగూడెం సాండ్ ట్యాక్స్ పాలసీలకు సంబంధించి రెండు ఇసుక రీచ్‌లను ఒకేచోటు ఏర్పాటు చేసి పేరబోయినగూడెం నుంచి ఇసుక రవాణా చేస్తున్నారని అన్నారు. ఇసుక రవాణాతో ప్రజలకు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలికి సన్మానం

అర్వపల్లి : అర్వపల్లి ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలు భూపతి స్వరూపరాణి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు పొందడంతో సోమవారం ఆమెను హెచ్ఎం యాకలక్ష్మి సన్మానించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయినులు రేణుక, శైలజ, ఐఈఆర్‌పీ వినిత, శేఖర్ పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతో ఉద్యోగులకు గుర్తింపు

తిరుమలగిరి : పనిచేసిన ప్రతిచోట ఉత్తమ సేవలందించినప్పుడు ఉద్యోగులకు గుర్తింపు లభిస్తుందని తహసీల్దార్ హరిప్రసాద్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న చందు, అజయ్, వినోద్‌లు ఉద్యోగోన్నతి పొంది జీపీఓలుగా నిజామాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. బదిలీపై వెళ్లిన వీరిని కార్యాలయంలో ఘనంగా సన్మానించారు.

కాలువ మరమ్మతు చేయించాలని వినతి

అర్వపల్లి : రామన్నగూడెం గ్రామ శివారులో ఎస్సారెస్పీ 71డీబీఎం కాలువకు తరచూ గండ్లు పడుతున్నాయని, వెంటనే మరమ్మతులు చేయించాలని మాజీ ఎంపీటీసీ సభ్యుడు, గిరిజన సంఘం నాయకుడు రమావత్ శంకర్‌నాయక్ భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని కోరారు. సోమవారం హైదరాబాద్‌లో ఎంపీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సబావత్ శ్రీనివాస్‌నాయక్, నాగు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ సభ్యత్వ నమోదు

పెన్‌పహాడ్ : మండల కేంద్రంతోపాటు గాజులమల్కాపురం, అనాజీపురం, పొట్లపహాడ్, అన్నారం, చీదెళ్ల, దోసపహాడ్, అనంతారం ప్రాథమిక పాఠశాలల్లో సోమవారం టీపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాపర్తి రామనర్సయ్య, పుష్పాల వీరన్న, తన్నీరు రమేష్, రాచూరి ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పకడ్బందీగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ

భానుపురి : అన్ని నియోజకవర్గాల పరిధిలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)–2026 ప్రక్రియను పకడ్బందీగా చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో ఎస్ఐఆర్ ప్రక్రియపై ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ సీతారామారావు, ఆర్డీఓలు వేణుమాధవ్, సూర్యనారాయణ, శ్రీనివాసులు, ఎలక్షన్ డీటీ వేణు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసు ఎత్తివేయాలి

సూర్యాపేట : ఖమ్మంలో జర్నలిస్టుపై అక్రమ కేసును ఎత్తివేయాలని సూర్యాపేట పట్టణ జర్నలిస్టు సంఘాల నాయకులు వజ్జె వీరయ్య యాదవ్, మిక్కిలినేని శ్రీనివాసరావు, గుండా శ్రీనివాస్ గుప్తా, కందుకూరి యాదగిరి అన్నారు. సోమవారం స్థానిక వాణిజ్యభవన్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. యూరియా కోసం రైతులు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తే కేసులు నమోదు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు సంఘాల నాయకులు పెద్దింటి శ్యాంసుందర్‌రెడ్డి, అమరగాని నాగేందర్, గునగంటి సురేష్, నాగరాజు, విజయ్, జహంగీర్, రాపర్తి మహేష్, యనమల యాకయ్య, దేవరగట్ల సతీష్, కందుల నాగరాజు, మదూరి బ్రహ్మాచారి, బొజ్జ ఎడ్వర్డ్, శిగ సురేష్, మందాడి గోవర్ధన్, శ్రవణ్, నందిపాటిసైదులు, అయినాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలు ప్రారంభం



సూర్యాపేట : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడలను ప్రారంభిస్తున్న కొప్పుల వేణారెడ్డి

సూర్యాపేట: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. సోమవారం సూర్యాపేట మండలం యండ్లపల్లి గ్రామంలో దండి అంతయ్య జ్ఞాపకార్థం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సూర్యాపేట నియోజకవర్గ స్థాయి వాలీబాల్ క్రీడోత్సవాలకు హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని అన్నారు. క్రీడలతో మనస్సుకు ఉల్లాసం కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోతి గోపాల్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దండి రమేష్, ఎంఈఓ శేషగాని శ్రీనివాస్‌గౌడ్, దండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగెళ్ల కరుణాకర్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు కుంట్ల వెంకట నాగిరెడ్డి, మార్కెట్ డైరెక్టర్ దాసరి తిరుమల్ రావు, అంజద్ అలీ, చింతమళ్ల రమేష్, మందాడి కిరణ్, తాటిపాముల లక్ష్మి, నాగేశ్వరరావు, మల్లేష్ గౌడ్, రావుల రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రశంసాపత్రాలు అందజేత



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేషులు

సూర్యాపేటటౌన్ : కేరళ రాష్ట్రంలో జరిగిన ట్రెక్కింగ్ క్యాంప్‌లో ఎస్వీ డిగ్రీ కళాశాలకు చెందిన బీఎస్సీ బీటీజెడ్‌సీ తృతీయ సంవత్సరం చదువుతున్న ఎన్‌సీసీ విద్యార్థిని వర్మల సుష్మ ఉత్తమ ప్రతిభ కనబరిచింది. అలాగే కళాశాలలో బీఏ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి చిన్నపంగు మదన్ ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి 5కే రెడ్ రన్ పోటీలలో గెలుపొందాడు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ వెంకటేషులు సోమవారం ఇద్దరు విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ నాగు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎంకు సన్మానం

ఆత్మకూర్ (ఎస్) : ఆత్మకూర్(ఎస్) మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేసి ప్రమోషన్‌పై మోతె జెడ్పీ హెచ్‌ఎస్‌కు ఇటీవల బదిలీ అయిన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలు పి.వనజకు విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల సమక్షంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు వి.శ్రవణ్ కుమార్ అధ్యక్షతన సోమవారం వీడ్కోలు అభినందన సభ నిర్వహించారు. ఉపాధ్యాయురాలు వనజ పాఠశాల విద్యార్థులందరికీ నోట్ పుస్తకాలు, పలకలు, పెన్నులు, పెన్సిళ్లు, రైటింగ్ ప్యాడ్స్ బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ధారాసింగ్, హెచ్ఎం ప్రసన్న కుమార్, మాజీ ప్రధానోపాధ్యాయురాలు వెన్న ఊర్మిళ, ఉపాధ్యాయులు రంగా జగన్, చౌదర్ రెడ్డి, రమేష్, సురేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.



వనజను సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది